ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 21 సెప్టెంబరు 2024



5 నుంచి విశాఖ, అరకు మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 20: పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అక్టోబరు 5 నుంచి విశాఖపట్నం-అరకు మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని వాల్తేరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08525 నంబరు గల రైలు వచ్చే నెల ఐదు నుంచి 15వ తేదీ వరకూ ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలుదేరి 11.30 గంటలకు అరకులోయ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08526 నంబరు గల రైలు అదే తేదీల్లో మధ్యాహ్నం 2.00 గంటలకు అరకులోయలో బయలుదేరి సాయంత్రం 6.00 గంటలకు విశాఖ చేరుతుంది.

ఉత్సాహంగా ఇది మంచి ప్రభుత్వం

- జిల్లాలోని అన్ని నియోజవర్గాల్లోనూ ప్రారంభం
- వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన పనులను, అమలు చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించిన కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులు



భీమిలి: మేదర వీధిలో దివ్యాంగుడికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



తాటిచెట్లపాలెం జంక్షన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' సభలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్. చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నార్త్ జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్ ఉన్నారు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. నియోజక వర్గాల్లో వారం రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. తొలిరోజు అన్ని నియోజక వర్గాల్లో ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాన్ని ఇంటింటికీ అందజేశారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని ఆరిలోవలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి ... మిగతా 6వ పేజీలో

బదిలీలకు జోరుగా పైరవీలు

ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు సిఫారసు లేఖలు సమర్పణ

- తలలు పట్టుకుంటున్న ఉన్నతాధికారులు
- రెవెన్యూ బదిలీల్లో యూఎల్‌సీ కింగ్ హల్‌చల్
- కూటమి కీలక నేత చీవాట్లు
- వీఎంఆర్‌డీఏ సెక్రటరీ పోస్టుకు గట్టి పోటీ



విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

బదిలీల ప్రక్రియలో పైరవీలు జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ శాఖలో డీటీ కేడర్ అధికారి ఒకరు తనకు పరిచయం ఉన్న ముగ్గురు కూటమి ప్రజా ప్రతినిధుల వద్ద నుంచి సిఫారసు లేఖలు సంపాదించారు. జల వనరుల శాఖలో పనిచేసే ఏఈఈ ఒకరు ఉత్తరాంధ్రలో ఒక మంత్రి, ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేల వద్ద సిఫారసు లేఖలు తీసుకున్నారు. అయితే ఆయనతోపాటు పనిచేసే ఒకరు ఆరు లేఖలు తీసుకున్నట్టు తెలిసి...మరో రెండు లేఖల కోసం యత్నిస్తున్నారు.

కోరుకున్న చోటకు బదిలీ, ఉన్నచోట నుంచి కదిలించకుండా ఉంచేందుకు ఉద్యోగులు తమకు తెలిసిన కూటమి ప్రజా ప్రతినిధుల నుంచి తీసుకున్న సిఫారసు లేఖలను ఉన్నతాధికారులకు ఇస్తున్నారు. ఒక్కొక్కరు రెండు, మూడు, కొందరైతే ఐదు సిఫారసు లేఖలు సమర్పిస్తుండడంతో ఉన్నతాధికారులు ఆశ్చర్యపోతున్నారు. గతంలో తమకు తెలిసిన ఒక ప్రజా ప్రతినిధి నుంచి లేఖ తీసుకుని పోస్ ... మిగతా 6వ పేజీలో

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు మార్గదర్శకాలు జారీ

- కొన్ని స్థానాలు ముందే భర్తీకి ప్రయత్నాలు?

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు మార్గదర్శకాలను శుక్రవారం విడుదల చేశారు. ఆదాయం బట్టి కార్యాలయాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారిని బదిలీకి అర్హులుగా ప్రకటించారు. అత్యధిక ఆదాయం వచ్చే కార్యాలయాలకు భారీ డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ బదిలీలకు మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇచ్చారు. అవి ఉన్నా సరే ఉన్నతాధికారుల కరుణ లేనిదే కీలక స్థానాలు దక్కే అవకాశం లేదు. అయితే ఆ శాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న పెద్దలు వారికి నచ్చిన వారికి ముందుగానే బదిలీ ఉత్తర్వులు ఇచ్చేసి, మిగిలిన స్థానాలకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే బదిలీలలో భారీ మొత్తాలు చేతులు మారినట్టుగానే అనుమానించాల్సి ఉంటుంది. అలా కాకుండా అన్ని స్థానాలను 100 శాతం కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తే పారదర్శకంగా చేసినట్టు అవుతుంది. ఏదో మతలబు చేయాలనే ఉద్దేశంతో చివరి తేదీ వరకు ఊగిసలాడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

భీమిలి ఆర్డీవో బరితెగింపు!



భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి

రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఏడాది కిందట నివేదిక

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

ఆయనో రెవెన్యూ ఉన్నతాధికారి. ప్రభుత్వ భూములను, ఆస్తులను రక్షించాల్సిన ఆయన...అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన భూమి ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు తన వంతు సహకారం అందించారు. గత ప్రభుత్వ పాలకులు తమ అవసరాల కోసం ఏరికోరి తెచ్చుకున్న సదరు అధికారి తప్పు చేసినట్టు తేలినా కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నాటి వైసీపీ కీలక నేతల హస్తం?

- ఆ విషయం గుర్తించి, అడ్డుకున్న జేసీని బదిలీ చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం రావడంతో వెలుగులోకి అక్రమాలు
- ఆర్డీవో సహా ముగ్గురిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం
- ఉన్నతాధికారుల తాత్సారం



మధురవాడ సర్వే నంబరు 133లో హౌసింగ్ బోర్డుకు చెందిన భూమి

జిల్లాల విభజన అనంతరం విశాఖపట్నం జిల్లాలో కొత్తగా ఏర్పాటైన భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారిగా వచ్చిన ఎస్.భాస్కరరెడ్డి వైసీపీ నేతలు చెప్పిందల్లా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. డివిజన్‌లో వందలాది ఎకరాల డీపట్టా భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారంలో అప్పటి పాలకులు/ఉన్నతాధికారులు చెప్పినట్టు నడుచుకున్నారనే విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆయన వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తికి అనుకూలంగా నివేదిక ఇచ్చిన విషయం వెలుగుచూసింది.

కోట్ల విలువైన భూమి పరాధీనం చేసే యత్నం

మధురవాడలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన హరిత గృహ సముదాయానికి ఎదురుగా సర్వే నంబరు 133లో గల 9.36 ఎకరాలను 2008లో హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం బదలాయించింది. అప్పట్లో విశాఖ రూరల్ తహసీల్దారుగా ఇదే భాస్కరరెడ్డి ఆ భూములను హౌసింగ్ బోర్డుకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ 9.36 ఎకరాలు హౌసింగ్ బోర్డు ఆధీనంలోనే ఉంది. ఈ భూమిలో హౌసింగ్ బోర్డు ఎటువంటి ... మిగతా 6వ పేజీలో

సీతారాం ఏచూరికి ఘన నివాళి

సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంతాప సభలో ఏచూరి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. - 6లో



దుర్గ్ వందేభారత్‌కు స్పందన అంతంతే..

- నేడు 995 సీట్లు ఖాళీ



విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు వేసిన కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు పెద్దగా ఆదరణ లభించేలా లేదు. ఈ నెల 18న లాంఛనంగా ఈ రైలును ప్రారంభించిన సంగతి తెలిసిందే. 20వ తేదీ నుంచి రెగ్యులర్‌గా వారానికి ఆరు రోజులు నడుస్తుందని ప్రకటించారు. ఆదివారం సెలవు. ఈ రైలులో మొత్తం నాలుగు విభాగాలు ఉండగా అందులో 1,286 సీట్లు అందుబాటులో ఉన్నాయి. శుక్రవారం ఇక్కడి నుంచి వెళ్లిన రైలులో మూడొంతుల రైలు ఖాళీగానే ఉంది. శనివారం విశాఖ నుంచి దుర్గ్‌కు వెళ్లే రైలు రిజర్వేషన్ వివరాలు చూస్తే...1,286 సీట్లకు గాను 995 సీట్లు ఖాళీగా అందుబాటులో ఉన్నాయి. అలాగే ఈ వారం అంతా రిజర్వేషన్ తీరు అదే విధంగా ఉంది. ఈ మార్గంలో వందే భారత్‌కు అంత డిమాండ్ లేకపోయినా రాయపూర్-విశాఖ మధ్య వ్యాపార సంబంధాల కోసం ఒడిశా పెద్దలు ఈ రైలును వేయించుకున్నారు. నాలుగో వంతు ప్రయాణికులతో ఎన్నాళ్లు నడుపుతారో చూడాలి మరి.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు సీఎం ప్రత్యేక మిషన్ ఏర్పాటుచేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్



వి.శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి, ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఒక ప్రత్యేక మిషన్ ఏర్పాటుచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్లాంటులో షెడ్యూల్ ప్రకారం ... మిగతా 6వ పేజీలో

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 20: నిర్వహణ పనుల వల్ల శనివారం ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతు బజారు, ఆకాష్ జూనియర్ కాలేజీ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరద బాధితులకు రూ.50 వేల విరాళం

మహారాణిపేట, సెప్టెంబరు 20: సీఎం సహాయనిధికి కంచరపాలెంలోని ఐలా సంస్థ చైర్మన్ జగపతి రాజు రూ.50 వేల చెక్కును కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు అందజేశారు. గతంలో రూ.50 వేల విరాళం ఇచ్చిన సంస్థ శుక్రవారం మరో రూ.50 వేల చెక్కును అందజేసింది.

హామీల అమలు దిశగా బాబు పాలన: ఎంపీ శ్రీభరత్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 20: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ తెలిపారు. గ్రేటర్ 45వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.లక్ష కోట్లకు పైగా బకాయి పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం కష్టాల్లో ఉందని, మెల్లమెల్లగా అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను త్వరలో ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను కొంతమందికి మాత్రమే ఇచ్చారన్నారు. అన్నక్యాంటీన్లకు రూ.5కే భోజనం అందిస్తున్న అక్షయపాత్ర సంస్థను అభినందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్ తదితరులు

ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఆపేసి అన్నం పెట్టే చేతినే నరికేసిందని మండిపడ్డారు. దుర్మార్గపు పాలన సాగించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసినందునే కూటమిని గెలిపించారని చెప్పారు. వైసీపీ నేతలు అరాచకాలు, గూండాయిజం చేస్తే గట్టిగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నజీర్, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్లు కంపా హనోక్, పెద్దిశెట్టి ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వార్డుల కూటమి అధ్యక్షులు భరణికాన రాజు, గార ఈశ్వరరావు, పుక్కళ్ల పైడికొండ, కుట్టా కార్తీక్, కన్నం వెంకట రమణారావు, నమ్మి రవికుమార్, నాయకులు వాసుపల్లి రాజు, యాగాటి ఆదిలక్ష్మి, గొలగాని సౌజన్య, జీవీఎంసీ జడ్సీ రాము పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి మృతికి సంతాప సూచికంగా మౌనం పాటిస్తున్న నాయకులు

ఏచూరి ఆశయసాధనకు సీపీఎం కృషి

▸▸ సంతాపసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం తమ పార్టీకే కాక దేశానికి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరై ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్ష, లౌకిక శక్తులను కూడగట్టడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన పోరాట పటిమ, పార్టీలో అంచెలంచెలుగా అగ్రస్థానానికి ఎదిగిన క్రమాన్ని వివరించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి సీపీఎం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ, సీపీఐ, ఆర్‌పీఐ నాయకులు సీహెచ్ నరసింగరావు, ఎం.పైడిరాజు, ఎస్.సుధాకర్, సీర సతీష్, దేవ, గణేష్‌పాండ, కల్యాణరావు ఎ.అశోక్ పాల్గొన్నారు.

పాత నగరాన్ని గోల్డ్‌సిటీగా మారుస్తా: వంశీకృష్ణ

దొండపర్తి, సెప్టెంబరు 20: పాతనగరాన్ని 'గోల్డ్ సిటీ'గా మార్చడం, సీఎస్సార్ నిధులతో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, నెహ్రూ బజార్ ఆధునికీకరణ తన లక్ష్యమని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రేటర్ 27వ వార్డు నెహ్రూబజార్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులే అయినా ప్రజల గుండెల్లో నిలిచిపోయే ముఖ్యమైన హామీలు నెరవేర్చామన్నారు. ఉద్యోగుల బదిలీలు, పరిపాలన సౌలభ్యం కోసం అనేక కార్యక్రమాల రూపకల్పనలో ప్రభుత్వం నిమగ్నమై ఉందన్నారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, ఒకటో తేదీకి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, జాప్యం లేకుండా పింఛన్ల పంపిణీ వంటి హామీలు నెరవేర్చామని చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను గోడకు అతికించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వుడా కార్యదర్శి కీర్తి, దక్షిణ నియోజకవర్గం టీడీపీ, జనసేన ఇన్‌చార్జులు సీతంరాజు సుధాకర్, శివప్రసాద్‌రెడ్డి, వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, వార్డు టీడీపీ, జనసేన అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, చంటి, టీడీపీ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, మాజీ కార్పొరేటర్ రాజు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ హరేందిర్ ప్రసాద్, నాయకులు, అధికారులు

సంక్షోభం నుంచి ప్రగతిపథంలోకి..

మహారాణిపేట, సెప్టెంబరు 20: సంక్షోభం నుంచి అభివృద్ధి పథంలోకి కూటమి ప్రభుత్వం దూసుకెళ్తోందని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మహారాణిపేట 29వ వార్డులోని దండుబజారు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించిన ప్రభుత్వ సిబ్బందిని సన్మానించారు. బీజేపీ నాయకులు రామ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అనురాధ పాల్గొన్నారు.

నౌపడ-గుణుపూర్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన

విశాఖపట్నం, సెప్టెంబరు 20: వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, గుణుపూర్ సెక్షన్‌లో తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం తనిఖీలు చేశారు. అమృత్ స్టేషన్ పథకం కింద నౌపడ స్టేషన్ వద్ద చేపట్టిన నిర్మాణ పనుల్లో భాగంగా 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన, ఇతర నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. అక్కడ నుంచి పర్లాకిమిడి స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, రైల్వే కార్యాలయాల నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే 12 మీటర్ల పాదచారుల వంతెన పనులను తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన రైల్వే వినియోగదారుల సంఘం ప్రతినిధుల వినతులను పరిశీలించి మరిన్ని ప్రయాణ సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గుణుపూర్, తిరువేలి మధ్య రైల్వే లైన్ ఏర్పాటు ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు. డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

బదిలీలకు జోరుగా పైరవీలు

... 5వ పేజీ తరువాయి

చేయించుకునేవారు. ఇప్పుడు అలా కాకుండా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ద్వారా మూడు పార్టీల ప్రజా ప్రతినిధుల నుంచి లేఖలు తీసుకుంటున్నారు. ఇలా కుప్పలు తెప్పలుగా వస్తున్న సిఫారసు లేఖలను తీసుకుంటున్న ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి వెంటనే సంబంధిత ప్రజా ప్రతినిధులకు ఫోన్ చేసి ఎవరిని పరిగణనలోకి తీసుకోవాలని అడుగుతున్నట్టు తెలిసింది. బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉంది. ఇదిలావుండగా సిఫారసు లేఖలు ఇచ్చేందుకు కొందరు నేతలు తమ అనుచరులు, మధ్యవర్తుల ద్వారా సొమ్ములు తీసుకుంటున్నారనే ప్రచారం సాగుతుంది.

యూఎల్‌సీ కింగ్ పైరవీలు

గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన యూఎల్‌సీ కింగ్ కూటమి ప్రభుత్వంలో తనకు తెలిసిన ఇద్దరు ప్రజా ప్రతినిధుల ద్వారా రెవెన్యూ బదిలీల్లో పైరవీలు చేస్తున్నారని ప్రచారం సాగుతుంది. మహిళా తహసీల్దారు ఒకరికి ప్రాధాన్యం కలిగిన మండలంలో పోస్టింగ్ వేయించాలని కోరేందుకు ఒక ప్రజా ప్రతినిధి సూచన మేరకు ఉమ్మడి జిల్లాలో కీలక నేతను కలిశారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే యూఎల్‌సీ కింగ్‌పై కీలక నేత ఒంటికాలుపై లేచారని తెలిసింది. గత ప్రభుత్వంలో అనేక వివాదాస్పద భూముల వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నావని, చివరకు దసపల్లా భూముల్లో వైసీపీ నేతకు భారీగా లబ్ధి చేకూర్చడంలో కీలకపాత్ర పోషించావని మండిపడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చినా నీ పెత్తనం ఏమిటని చీవాట్లు పెట్టారని తెలిసింది.

వీఎంఆర్‌డీ సెక్రటరీ పోస్టుకు పైరవీ

విశాఖ జిల్లాలో రెండు చోట్ల తహసీల్దార్‌గా పనిచేసిన తరువాత పదోన్నతిపై బయటకు వెళ్లిన అధికారి ఒకరు వీఎంఆర్‌డీ సెక్రటరీగా రావాలని గట్టిగా యత్నించారు. నగరంలో కూటమికి చెందిన ప్రజా ప్రతినిధి ద్వారా సిఫారసు చేయించుకుని లేఖను మునిసిపల్ మంత్రికి అందజేశారు. అయితే సదరు అధికారి తహసీల్దారుగా ఉండగా ప్రభుత్వ చెరువులను జిరాయితీగా మార్చేసిన ఘనత ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఒక ఎమ్మెల్యే అప్రమత్తమై వెంటనే మంత్రి నారాయణకు సమాచారం అందించడంతో సదరు అధికారి పేరును తప్పించారు. ఇంకా నగరంలో తహసీల్దారుగా పనిచేసి పదోన్నతి పొందిన ఒకరు, సింహాచలం దేవస్థానం ఈవోగా పనిచేసిన మరొకరు వ్యక్తి వీఎంఆర్‌డీఏ సెక్రటరీ పోస్టుకు ప్రయత్నిస్తున్నారు.

'మన్యం ధీరుడు చిత్రాన్ని యువత వీక్షించాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: దేశభక్తిని రగిలించే మన్యంధీరుడు చలన చిత్రం వీక్షణ ఒక చారిత్రక అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మన్యం ధీరుడు చిత్రం విడుదల సందర్భంగా డాబాగార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర థియేటర్ వద్ద చిత్ర యూనిట్ సభ్యులు శుక్రవారం సందడి చేశారు. ఆర్‌వీవీ సత్యనారాయణ హీరోగా నటించిన చిత్రం ఆద్యంతం గొప్పగా ఉందని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. బ్రిటిష్ వారి గుండెల్లో సింహమై నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా నిర్మించిన మన్యం ధీరుడు చిత్రం ప్రతి ప్రేక్షకుడిలో దేశభక్తికాంక్షను రగిలిస్తుందన్నారు. చిత్ర దర్శకుడు నరేష్ డెక్కల మాట్లాడుతూ ఎందరికో స్ఫూర్తి కలిగించిన అల్లూరి చరిత్ర నేటి యువతకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులు, యూనిట్ సభ్యులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



చిత్ర విజయోత్సవంలో పాల్గొన్న నటీనటులు

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

ఆరిలోవ, సెప్టెంబరు 20: నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి శుక్రవారం రాత్రి ఆరిలోవ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగానే ఆయన స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆరిలోవ, పీఎంపాలెం, త్రీ టౌన్ స్టేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని తెలిపారు. ఆరిలోవ మారుమూల ప్రాంతం కావడం, అటవీ ప్రాంతంలో ఉండడంతో ఎక్కువ నేరాలు జరుగుతున్నాయని చెప్పారు. సిబ్బంది అనవసరంగా సెలవులు తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పెదగదిలి జంక్షన్‌లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత..ముగ్గురి అరెస్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 20: రైల్లో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,13,500 విలువ చేసే 22.7 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఒక కేసులో కేరళలోని కొల్లాంకు చెందిన సచిన్ జేను, మరో కేసులో బీహార్‌లోని బక్సర్ జిల్లాకు చెందిన అమిత్ పాఠక్, అయుష్‌కుమార్‌లను అరెస్టు చేశామని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే ఎస్‌ఐలు కాంతారావు, ఎస్.రామారావు తమ సిబ్బందితో గస్తీ తిరుగుతూ తనిఖీలు చేపడుతున్న సమయంలో నిందితులను పట్టుకున్నామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

▸▸ నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి




సీపీ శంఖబ్రత బాగ్చిని సన్మానిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు అనుగుణంగా ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగాలని నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి సూచించారు. గమ్యం చేరే సమయంలో, పోటీ పరీక్షల్లో ఒడిదొడుకులు సహజమని, ఒత్తిళ్లకు లోనవకుండా ముందుకు సాగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శ్రీ నవోదయ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి పోలీసు కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉద్యోగం రాలేదనే నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, షేక్ అన్వర్, కళాశాల కరస్పాండెంట్ డా.బీఆర్ఎస్ నారాయణ, భీశెట్టి మురళీప్రకాష్, డైరెక్టర్ విశ్వ కీర్తి, ప్రిన్సిపాల్ మైకేల్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన జరిగితేనే బీసీలకు న్యాయం

▸▸ బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

సీతంపేట, సెప్టెంబరు 20: జనాభా ప్రతిపాదికన బీసీల కులగణన జరగాలని, అంతకంటే ముందు ఎమ్మెల్యేల కులగణన చాలా అవసరమని రిటైర్డు పోలీసు ఉన్నతాధికారి, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 'బీసీల కులగణన, అత్యవసర అమలు, అవసరం, బీసీల రాజ్యాధికారం, హక్కుల సాధన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా కులాంధ్రప్రదేశ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రాధాన్యం చాలా తక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. దామాషా ప్రకారం మంత్రి పదవులు, ఇతర పోస్టుల్లో సింహభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ధైర్యం ఉందా? అన్ని సవాల్ విసిరారు. సమగ్ర కులగణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని, దీని కోసమే బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు. అధికారం లేకపోతే అణగారిన కులాలుగానే మిగిలిపోతారని, 50 శాతంపైగా ఉన్న బీసీల కోసం 2 శాతం నిధులు ఖర్చు చేసే దుర్మార్గం జరుగుతూనే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, బీఎస్పీ నాయకులు లాకే రాజారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

శరన్నవరాత్రి మహోత్సవాలకు రాట

సీతమ్మధార, సెప్టెంబరు 20: నక్కవానిపాలెంలోని ఏడు గుళ్ల అమ్మవారి ఆలయం వద్ద లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మహిళలు, యువతతో కలిసి రాటను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు రాజశ్రీనివాస్ రాజేష్, పవన్, చిన్న రామిరెడ్డి, రాజు, దుర్గా జగదీష్, సూకేష్, గణేష్, మురళి శంకర్ పాల్గొన్నారు.

నేడు దుర్గాగణపతి ఆలయంలో అన్నదానం

సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో శనివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

భీమిలి ఆర్డీవో బరితెగింపు!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచింది. ఆ భూమిపై కన్నేసిన ఒక వ్యక్తి సర్వే నంబర్ 133లో 3.47 ఎకరాలు తనదంటూ ఏడాది క్రితం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. భూమి కొట్టేయడానికి వీలుగా తప్పుడు పత్రాలు సృష్టించారు. ఐటీ సంస్థలు, భారీ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు ఉన్న ఆ ప్రాంతంలో ఎకరా రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు పలుకుతుంది. తప్పుడు పత్రాలతో భూమి కాజేసే యత్నం వెనుక నాటి వైసీపీలో కీలక వ్యక్తులు ఉండడంతో అధికారులు ఫైలు ఆగమేఘాలపై ముందుకు కదిపారు. సర్వే నంబరు 133లో 9.36 ఎకరాలను హౌసింగ్ బోర్డుకు అప్పగించిన విషయాన్ని ప్రస్తావించకుండా భీమిలి ఆర్డీవో ద్వారా జేసీకి పంపారు. ఈ ఫైలు అందే సమయంలో జేసీగా విశ్వనాథన్ ఉన్నారు. అదే సమయంలో మధురవాడలో తమకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని హౌసింగ్ బోర్డు అధికారులు జేసీకి చెప్పడంతో పాటు భూమి వివరాలు అందజేశారు. దీంతో ఆయన అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అప్పటికే తన వద్ద ఉన్న ఫైలులో ఉన్న సర్వే నంబరు, బోర్డు అధికారులు ఇచ్చిన సర్వే నంబరు ఒక్కటే కావడంతో ఆయనకు అనుమానం వచ్చింది. సాధారణంగా తన వద్దకు భూముల ఫైలు వస్తే వెంటనే సదరు భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం విశ్వనాథన్‌కు అలవాటు. ఆయన స్వయంగా మధురవాడలో సర్వే నంబరు 133లో గల భూమిని పరిశీలించి హౌసింగ్ బోర్డుకు కేటాయించినదిగా గుర్తించారు. అయినా ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిగా పేర్కొంటూ ఫైలు పంపడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించి ఆర్డీవో, అప్పటి విశాఖ రూరల్ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. తరువాత కొద్ది నెలలకు జేసీని ప్రభుత్వం బదిలీ చేయడం, ఈలోగా ఎన్నికలు రావడంతో భూమి వ్యవహారం తెర మరుగైంది. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్వే నంబరు 133లో గల భూ వ్యవహారంపై దృష్టిసారించింది. అక్రమాలు జరిగినట్టు గుర్తించి ఆర్డీవో భాస్కర్‌రెడ్డితో పాటు ఆర్ఐ మల్లేశ్వరరావు, గ్రేడ్-2 వీఆర్వో దుర్గాప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. తహసీల్దారు రమణయ్య అప్పటికే హత్యకు గురికావడంతో ఆయన పేరు ప్రస్తావించలేదు. తహసీల్దారుగా ఉన్నప్పుడు సర్వే నంబరు 133లో భూమిని హౌసింగ్ బోర్డుకు అప్పగించిన భాస్కరరెడ్డి, అదే ఆర్డీవో అయిన తరువాత అదే భూమిలో 3.47 ఎకరాలు ప్రైవేటు వ్యక్తికి అప్పగించేలా ఫైలు పంపడం పరిశీలిస్తే అక్రమాలకు ఏ విధంగా సహకరించారో అర్థమవుతుందని రెవెన్యూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా ఓట్ల లెక్కింపు అనంతరం సెలవుపై విదేశాలకు వెళ్లిన భాస్కర్‌రెడ్డి ఇటీవల తిరిగి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే హౌసింగ్ బోర్డు భూమి వివాదంలో ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైలు సిద్ధమైంది. అయినా ఆయన ఆర్డీవోగా తిరిగి బాధ్యతలు స్వీకరించేందుకు ప్రభుత్వం అనుమతించడం ఆశ్చర్యకరం.

ఉత్సాహంగా 'ఇది మంచి ప్రభుత్వం'

... 5వ పేజీ తరువాయి

రామకృష్ణబాబు పాల్గొన్నారు. భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతోపాటు కూటమి నేతలు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని నెహ్రూ బజార్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో చేసిన మంచిని, చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే 'ఇది మంచి ప్రభుత్వం' ఉద్దేశమన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని 45వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పశ్చిమ నియోజకవర్గంలోని ఏకేసీ కాలనీలో ఎమ్మెల్యే గణబాబు, పెందుర్తి నియోజకవర్గం ముదపాకలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

'భూదాన్ ఆక్రమణలు నివారించాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: భూదాన్ భూముల సంరక్షణకు నడుం కట్టిన సర్వోదయ మండల్ భూముల పరిరక్షణకు కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ చైర్మన్ ఎస్.రాంబాబు నాయుడు తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాలోని భూదాన్ భూములను సంరక్షించి, వాటిని సేకరించిన ఆచార్య వినోబా భావే సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. తెలంగాణ భూదాన్ బోర్డు చైర్మన్ ఆర్.శంకర్ నాయక్ మాట్లాడుతూ భూదాన్ భూముల రక్షణ తమ ధ్యేయమన్నారు. ప్రధాన కార్యదర్శి డి.దీనబంధు మాట్లాడుతూ పదేళ్ల తరువాత మండల్ తిరిగి ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు వల్లూరి లత, రవికుమార్, జి.ప్రదీప్ పాల్గొన్నారు.

ముమ్మాటికీ కేంద్రం తప్పిదమే

ఉక్కుపై సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ధ్వజం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 20: కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలతోనే విశాఖ ఉక్కు కర్మాగారం నష్టాల్లోకి చేరుకుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు దుయ్యబట్టారు. శుక్రవారం జగదాంబ వద్ద సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేట్‌కు దీటుగా ఎందుకు నిలువలేకపోతోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యానించడం ఆయన ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీయేని వెనకేసుకురావడం కోసం చంద్రబాబు విశ్వప్రయత్నం చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. కొవిడ్‌లోనూ విశాఖ ఉక్కు లాభాల్లోనే నడిచిందన్నారు. రాజకీయ కారణాలతో రాయబరేలిలో రైల్‌వీల్ ప్లాంట్ కోసం రూ.2 వేల కోట్లు అనవసరంగా ఖర్చు పెట్టడం, ఒడిశా మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఇనుప ఖనిజం కొనుగోలుకు ఒక్క టన్ను కూడా రాకపోయినా రూ.వెయ్యి కోట్లు వృధాగా ఖర్చుపెట్టడం, పన్నులు, డివిడెండ్ల పేరుతో రూ.58 వేల కోట్లు చెల్లించేలా చేసి కేంద్రం దీన్ని నష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు సీఎం ప్రత్యేక మిషన్ ఏర్పాటుచేయాలి

5వ పేజీ తరువాయి

ఉత్పత్తి పెంచడం, ముడిసరకు (రా మెటీరియల్) సరఫరా, సెయిల్‌లో విలీనం వంటి పనుల నిర్వహణ జరిగేలా ఈ మిషన్ చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఎంపీలు, ఉక్కు మంత్రిత్వ శాఖ, ప్లాంట్ ఉన్నతాధికారుల భాగస్వామ్యంతో ఈ మిషన్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్నం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాంటుకు సంబంధించి ఈ వంద రోజుల్లో రాష్ట్రంలోని కూటమి సర్కారు మాటలకు తగ్గట్టు చేతల్లో నిర్దిష్ట చర్యలేవీ తీసుకోలేదన్నారు. ప్లాంటుకు బొగ్గు సరఫరా చేయకుండా, బ్లాస్ట్ ఫర్నేస్ తెరిపించకుండా కార్మికులు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఆఫీసర్ల జీతాల్లో 30 శాతం కోతపెట్టడం, కాంట్రాక్టు కార్మికులకు 4 నెలలుగా జీతాలివ్వకపోవడం, ఉద్యోగులకు వేతన సవరణ చేయకపోవడం వంటి దుర్మార్గపు చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. కేంద్ర చర్యలపై వామపక్ష పార్టీలను, కార్మిక, ప్రజా సంఘాలను కలుపుకొని సీపీఎం పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ధర్నాలు రేపు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 20: విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు స్టీల్ ప్లాంటు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నాలు చేపట్టనున్నారు. ఉక్కు నిర్వాసిత కాలనీలు అగనంపూడి, వడ్లపూడి, పెదగంట్యాడ, గంగవరంలతో పాటు ఉక్కునగరంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ ధర్నాలు చేపట్టనున్నారు. స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని, కార్మికులను తొలగించరాదని, ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తి తీయాలని తదితర అంశాలతో ఆందోళన చేయనున్నామని సీఐటీయూ నాయకులు కోరారు.

కణితి పాఠశాలలో హిందీ దివస్

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 20: రాజ భాషయిన హిందీపై మక్కువ కలిగి ఉండాలని కణితి జడ్పీ హైస్కూలు ప్రధాన ఉపాధ్యాయుడు బి.సూర్యప్రకాశ్ అన్నారు. పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ నిర్వహించారు. హిందీ భాష ఆవశ్యకత వివరిస్తూ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్నాజీ, శిరీష, భానుమతి, శశికళ, అరుణ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు చేరువగా ప్రభుత్వం'

పెదగంట్యాడ, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం గత వందరోజుల్లో సంక్షేమ పాలనలో ప్రజలకు చేరువ చేసినట్టు గాజువాక నియోజకవర్గ నోడల్ అధికారి పద్మలత అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా జీవీఎంసీ 75వ వార్డు కండిపిల్లివీధిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీ బాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కూటమి నాయకులు నమ్మి అప్పారావు, కోన చినఅప్పారావు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు



ఎస్సీ ఉద్యోగుల, అధికారులతో రామ్‌చందర్

విశాఖపట్నం, సెప్టెంబరు 6: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ శుక్రవారం పోర్టు అథారిటీని సందర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీల్‌కుమార్‌బాబు, క్రాంతికుమార్ ఉన్నారు. పోర్టు డిప్యూటీ ఛైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దుబే స్వాగతించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఉద్యోగులు తమ సమస్యలను వివరించారు. అనంతరం పోర్టు యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సమస్యలపై వినతి

అక్కిరెడ్డిపాలెం: ఎస్సీల సమస్యలను పరిష్కరించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడే వడ్డేపల్లి రామచంద్రరావుకి టీడీపీ 69వ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు విన్నవించారు. నగరానికి విచ్చేసిన ఆయనను రాజు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపుతో పాటు పలు పథకాల అమలుకు సహకరించాలని కోరారు.

'సంస్థ ప్రగతికి ఉద్యోగులే కీలకం'

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 20: ఏ సంస్థ ప్రగతికి ఉద్యోగులే కీలకమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జీవీఎస్. ప్రసాద్ అన్నారు. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో వ్యక్తులతో పెట్టుబడులు, మంచి భవిష్యత్తు నిర్మించటం అనే థీమ్‌తో క్వాలిటీ కాన్సెప్ట్‌లపై ఉక్కు క్లబ్ ఎంపీ హాల్‌లో నిర్వహించిన చాప్టర్ కన్వెన్షన్ శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. జాతీయ ఉక్కు పరిశ్రమలో ముఖ్యంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నాణ్యమైన, లీన్ కాన్సెప్ట్‌లను స్వీకరణకు ప్రాముఖ్యత ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీజీఎం (హెచ్ ఆర్) జి.గాంధీ, నేవల్ డాక్‌యార్డ్ జీఎం (హెచ్‌ఆర్, క్యూఏ) సంజయ్‌కుమార్, వివిధ సంస్థ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు51, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 24, క్యారెట్ 37, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది) 105, బరబాటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5,తోటకూర (కట్ట) 5, మామిడికాయలు72,బూడిదగుమ్మడికాయ30,కర్రపెండలం 26, మామిడి అల్లం100, బొప్పాయి 35,జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..



ముదపాకలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల



పైడిమాంబ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

జనం మెచ్చేలా వందరోజుల పాలన

▸▸ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంచకర్ల , గణబాబు

పెందుర్తి, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం వంద రోజుల ప్రజా పాలనతో రాష్ట్రంలో సుస్థిరత నెలకుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. కూటమి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మండలంలోని ముదపాకలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి ప్రచారం చేశారు. ప్రభుత్వం నెరవేర్చిన ఎన్నికల హామీల పత్రాన్ని గ్రామస్థులకు అందజేశారు.అనంతరం జరిగిన సభలో ఆయన ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అం దిస్తుందన్నారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేసి సర్పంచ్‌ల గౌరవాన్ని పెంచామన్నాను. వైసీపీ పాలనలోని తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల మన్ననలు పొందగలిగామన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ రానున్న కాలంలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా విజనరీ గల సీఎం చంద్రబాబు మార్చనున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, టీడీపీ నేత సుఖవాసి అజయ్, జిల్లా జనసేన కార్యదర్శి ఐతి సింహాచలం, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో సత్యనారాయణ, ప్రత్యేకాధికారి శేషశైలజ కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆర్పీపేట, (కంచరపాలెం)/ మల్కాపురం/ సింధియా/ ఎన్.ఎ.డి: గత ప్రభుత్వం మిగిల్చిన సంక్షోభంనుంచి సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. 56వార్డు పైడిమాంబకాలనీలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గణబాబు మాట్లాడారు.వంద రోజుల పాలనలో సూపర్ సిక్స్ పథకాలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లను ప్రారంభించి ప్రజా మన్ననలను పొందామన్నారు. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, జోన్-5 కమిషనర్ రాము,డీఈ ఏడుకొండలు, ఏపీడీ చిరంజీవితో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. 40వ వార్డు ఏకేసీ కాలనీలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్ర మం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మె ల్యే గణబాబు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా తొలుత కాలనీలో పర్యటించారు.టీడీపీ నాయకులు గేదల రమణ, జీవీఎంసీ ఏపీడీ ఏడుకొండలు, డీఈ ఏడుకొండలు పాల్గొన్నారు.జీవీఎంసీ 90వ వార్డు కాకానీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద 100రోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం పేరిట నిర్వహించిన కార్యాక్రమంలో గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

గాజువాక: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం కరపత్రాలను శనివారం పలుచోట్ల టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. 72వ వార్డులో వార్డు టీడీపీ ఇన్‌చార్జి అక్కిన లక్ష్మణరావు తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ ప్రసాద్, మాధవరావు, అంజనేయులు, వెంకటరావు పాల్గొన్నారు. గాజువాకలో బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావుకరపత్రాలుపంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రేమ, సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

▸▸ ఎంపీ శ్రీభరత్

గోపాలపట్నం, సెప్టెంబరు 20: పేదల కడుపు నింపడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. స్థానిక రైతుబజారు సమీపంలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాలుఅమలు చేసినట్టు చెప్పారు. గత ప్ర భుత్వ హయాంలో మూతపడిన అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తున్నట్టు చెప్పారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం కక్షసాధింపుతో రాష్ట్రంలోని మూసివేసిన రాష్ట్ర వ్యాప్తంగా 200



గోపాలపట్నం అన్న క్యాంటీన్‌లో అల్పాహారం చేస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే గణబాబు

అన్న క్యాంటీలను అందుబాటులోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారని అన్నారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌లో స్థానిక ప్రజలతో పాటు ఎంపీ భరత్, ఎమ్మెల్యే గణబాబు అల్పాహారం చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాజీ జంక్షన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

బాజీ జంక్షన్‌లో అన్న క్యాంటీన్ ప్రారంభం

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు బాజీజంక్షన్ సంత వెనుక ఉన్న అన్న క్యాంటీన్‌ను శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యేగణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జెడ్పీ కె.హైమావతి, ఈఈ రత్నాకర్ రెడ్డి, డి.ఇ.విజయ్‌కుమార్, ఏఈ వెంకటలక్ష్మీ, ఏపీడీ శ్రీరామ్, స్థానిక నాయకులు మళ్ల అప్పారావు, నరవ అనుష, పట్నాయిక్, మున్నా, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పెరుగుతో అభిషేకం



వెంకటేశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి, సెప్టెంబరు 20: పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భాద్రపద పౌర్ణమి సందర్భంగా ధధ్యాభిషేకం నిర్వహించారు.ఈసందర్భంగా స్వామి మూలవిరాట్టుకు 120లీటర్ల పెరుగుతో అభిషేకం చేశారు. అనంతరం స్వామిని అలంకరించి, పూజలు, అర్చనలు నిర్వహించి నక్షత్ర హారతలిచ్చారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగింపు ఉత్సవం

అక్కిరెడ్డిపాలెం: కాపు తుంగ్లాం కాలనీలో నిర్వహిస్తున్న సిదిరథ వినాయక మహోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన నిర్వాహకులు అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ ఉత్సవాలలో అక్కిరెడ్డి శ్రీనివాసరావు, కరణం ముత్యాలనాయుడు, సాలాపు మురళి, కోన శ్రీను, కంచిపాటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.లో హిమాలయ ఆప్టికల్స్ షోరూం ప్రారంభం



స్టోర్స్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న సినీ నటి అనన్య నాగళ్ల

ఎన్.ఎ.డి. జంక్షన్, సెప్టెంబరు 20: ఎన్.ఎ.డి.దరి బుచ్చిరాజుపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన 8వ హిమాలయ ఆప్టికల్ స్టోర్స్‌ను సినీ నటి అనన్య నాగళ్ల శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టోర్‌లో అత్యాధునిక సాంకేతికతో కూడిన కళ్లద్దాలను సామాన్యులకు సైతం అందుబాటు ధరలో లభ్యమయ్యేలా నిర్వాహకులు ఉంచారన్నారు. కళ్ల వైద్య పరీక్షలకు వీలుగా సాంకేతిక వ్యవస్థ వినియోపిస్‌తోపాటు నిష్ణాతులైన టెక్నీషియన్స్‌తో ఉన్నారన్నారు. ఇటువంటి షోరూంను ప్రారంభించటం ఎంతో ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. చిన్నారులకు స్టైలిస్ట్ లెన్స్ అద్దాలు అందుబాటులో ఉన్నాయన్నారు. హిమాలయ రీజినల్ హెడ్ మ యాంక్ బంగూర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతతో కూడిన కళ్లద్దాలను పరిచయం చేయటంలో తమ స్టోర్స్ ముందు ఉంటుందన్నారు. నటి అనన్యను చూసేందుకు అధిక సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు.

అన్న సమారాధన

పెందుర్తిరూరల్, సెప్టెంబరు 20: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవరపాలెం కాలనీలోని పశువుల ఆసుపత్రి వద్ద స్టైల్ స్టార్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిధిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించి సింహద్రి అప్పన్నస్వామి చిత్ర పటాన్ని అందజేశారు. టీడీపీ నాయకుడు దాట్ల మధు, అగ్రహారం సర్పంచి దాడి గోపి అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఆటోనగర్, సెప్టెంబరు 20: ఆటోనగర్ డీ బ్లాకులో శుక్రవారం మైక్రో స్మాల్ అం డ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ), విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సహకారంతో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలా మాజీ ఛైర్మన్ ఎన్. శేషగిరిరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న పరిశుభ్రమైన దేశం కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంఎస్ఎంఈ కోఆర్డినేటర్ ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో వీధులను శుభ్రం చేశారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలా మాజీ ఛైర్మన్ యార్లగడ్డ సాంబశివరావులు కాలుష్య నివారణకు మొక్కలు నాటించారు. అనంతరం పలువురికి మా స్కులు, సబ్బులు, టోపీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ఎంఈ సభ్యులు వీరయ్య, రేవతి, వినోద్, వర్మ, వాసీవా, ఐలా ప్రతినిధులు పరుచూరి ప్రభాకర్, కొల్లి సత్యనారాయణ,ఈ. కృష్ణ ప్రసాద్, అల్లూరి రాజు, జె.వి. సత్యనారాయణ, సర్వశుద్ది సత్య, ఒమ్మి నాయుడు, సన్యాసిరావు, వినోద్, సుబ్బారావు, జగదీష్, జె.వి. సత్యనారాయణ, రామప్రసాద్ రావు, సీహెచ్ సత్యనారాయణ, దామినేని శ్రీనివాస్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

డీపీఎస్‌లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

ఉక్కుటౌన్‌షిప్: ప్రతి ఒక్కరు సృజనాత్మకంగా ఆలోచిస్తూ వినూత్న ఆవిష్కరణలు చేయాలని స్టీల్ ప్లాంటు డీజీఎం ఎన్‌వీఎస్ రాజు అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలతో సృజనాత్మకత రూపకల్పన కార్యక్రమం నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులందిస్తున్న ప్లాంటు డీజీఎం ఎన్‌వీఎస్.రాజు, అధికారులు

త్రినాధపురంలో డ్రైడేఫ్రైడే...

సింధియా: జీవీఎంసీ 62 వార్డు త్రినాధపురంలో శుక్రవారం మలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో డ్రైడేఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. హెల్త్‌సూపర్‌వైజర్ సూర్యనారాయణ పాల్గొని మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో మల్కాపురం మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్, హెల్త్‌అసిస్టెంట్ వేణుబాబు, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులను పరిశీలించిన పోర్టు అధికారులు

మల్కాపురం, సెప్టెంబరు 20: ములగాడ గ్రామ రహదారి, ఈ మార్గానికి ఆనుకుని ఉన్న పోర్టు రహదారిని శుక్రవారం పోర్టు అధికారులు పరిశీలించారు. డాక్‌యార్డు సర్దార్ వల్లాబాయ్ పటేల్ వంతెన పునర్నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం దీనిని మూసివేసిన నేపథ్యంలో ములగాడ రహదారిలో వేల సంఖ్యలో ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, గోతులమయం కావడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ గులిగిందల లావణ్య వినతి, 'ఆం ధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల మేరకు శుక్రవారం పోర్టు ఎస్టేట్ అధికారులు నిరంజన్, మురళీతోపాటు జీవీఎంసీ సిబ్బంది రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా అనేక మంది ప్రజలు తాము పడుతున్న బాధలను తెలియజేశారు. వెంటనే రోడ్డును బాగుచేయకుంటే పోర్టు అధికారులకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్పందించిన పోర్టు అధికారులు తక్షణమే రోడ్డు నిర్మాణం పనులు జరిపే విధంగా ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 58వ వార్డు వైసీపీ ముఖ్యనేత గులిగిందల కృష్ణ, స్థానిక నాయకులు దర్మాల వేణుగోపాల్‌రెడ్డి, పెద్దాడ వెంకటరమణ, బొచ్చు పురుషోత్తం రెడ్డి, శీరపు నరసింగరావు, పెద్దాడ అప్పలరాజు, ఎదురువానిపాలెం ప్రాంతం నుంచి ఎదురు సన్యాశిరావు, తొనంగి వెంకటరమణి, ఎదురు శ్రీనివాసరావు, బాబీ, అనిల్, తేగేటి చిన్నా, పిలకవానిపాలెం నుంచి గోందేశి సత్యనారాయణ రెడ్డి, పిలక రమణి, కోట కృష్ణ, గంట్యాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ములగాడలో ఉన్న గొయ్యిని పరిశీలిస్తున్న పోర్టు అధికారులు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్మీ ఉద్యోగులు

మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

అగనంపూడి, సెప్టెంబరు 20: మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై స్థానిక పైడిమాంబ ఆర్మీ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడారు. దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడుతున్న సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కార్పొరేటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నేతలు కర్రి దొశేంద్ర, గంతకోరు అప్పారావు, బి. సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు విందుల సూర్యారావు, రాజు, ఉమామహేశ్వరరావు, నర్సింగరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అమలుచేయాలి :సీపీఎం

మల్కాపురం, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక పాలసీని అమలుచేయాలని కోరుతూ సీపీఎం పార్టీ నాయకులు గ్రేటర్ విశాఖ 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షులు కె.పెంటారావు మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి వందరోజులు గడిచినా పేదలకు ఉచిత ఇసుక అందజేస్తామన్న హామీ అమలుచేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇసుక ధరతోపాటు అందుబాటులో లేకపోవడంతో మధ్యతరగతి ప్రజలు ఇళ్లను నిర్మించలేకపోతున్నారని ఆయన ఆ రోపించారు. భవననిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డులను తక్షణమే పునరుద్ధరించాలని డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణకార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి, నాయకులు అప్పలనాయుడు, సూరి, గౌరినాయుడు, పైడినాయుడు, రాజు, రాజేష్, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

అగనంపూడి, సెప్టెంబరు 20: విజయవాడ వరద, ముంపు ప్రభావిత ప్రాంతాల సహాయక చర్యల్లో పాల్గొన్న 79, 85 వార్డుల పరిధి పారిశుధ్య కార్మికులతో పాటు, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్యలను స్థానిక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడారు. వరద ప్రాంతాల్లో 15 రోజుల పాటు పారిశుధ్య పనులు చేపట్టి యథా స్థితికి తీసుకురావడంలో కార్మికులు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి, ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరరావు, పట్నా రా మఅప్పారావు, హనుమంతురావు, కొండలరావు, సురేశ్, నరసింగరావు, వరహాలు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. కొండచిలువలు

ఒకే రోజు రెండు పట్టివేత



యారాడ కొండపై నేవీ క్వార్టర్స్‌లో పట్టుకున్న పాము

మల్కాపురం, సెప్టెంబరు 20: పారిశ్రామిక ప్రాంతంలో ఒకే రోజు రెండు కొండచిలువలను స్థానికులు పట్టుకున్నారు. నేవీ అధికారులు నివాసముంటున్న నౌసేనాబాగ్‌లో నాలుగున్నర అడుగుల కొండచిలువను శుక్రవారం రాత్రి స్థానికులు గుర్తించారు. నేవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు స్నాక్ క్యాచర్ నాగరాజును రప్పించారు. ఆయన ఆ పామును చాకచాక్యంగా పట్టుకున్నారు. అలాగే, యారాడ కొండపై ఉన్న నేవీ క్వార్టర్స్‌లో కూడా మరో కొండచిలువ ను పట్టుకున్నారు. ఈ కొండచిలను నివాసాలకు దూరంగా కొండపై విడిచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములు కనబడితే 75691 35128 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యాచకురాలి మృతి



మృతిచెందిన యాచకురాలు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 20: భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన బీహెచ్‌పీవీ జంక్షన్‌లో చోటుచేసుకుంది. గాజువాక పోలీసులు, స్థానికులందించిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం కోల్పోయిన సుమారు 30 ఏళ్ల మహిళ హిందీలో మాట్లాడుతు స్థానిక దుకాణాలు, హోటల్స్ వద్ద అడుక్కుంటూ ఉండేది. బీహెచ్‌పీవీ బస్టాప్‌లో నిద్రపోయేది. అయితే, ఆమె శుక్రవారం ఉదయం విగతజీవిగా బస్టాప్‌లో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. గాజువాక సీఐ పార్థసారథి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి ముఖం, చేయి, ఇతర భాగాలపై గాయాలుండడంతో అనుమానం వ్యక్తంచేశారు. బస్‌స్టాప్‌లో విరిగిన కర్రముక్కలు ఇతర వస్తువులున్నాయి. దీంతో క్లూస్ టీం వచ్చి మృతదేహాన్ని పరిశీలించింది. ఈ ప్రాంతంలో కొంతమందిరాత్రి వేళలో గంజాయి సేవించి తిరుగుతున్న వారేమైనా ఈ మహిళపై అఘాయిత్యానికి ప్రయత్నించారా? లేక రోడ్డుపై ఏదైనా వాహనం ఢీకొనడంతో గాయపడి మృతిచెందిందా..? అని స్థానికులు సందేహం వ్యక్తపరుస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించిన గాజువాక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 20: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని పార్కులు పలు కాలనీల్లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అధికారులతో కలసి శుక్రవారం పర్యటించారు. ముందుగా ఉడాలేఅవుట్ రజకవీధిలో నిర్మాణ దశలో ఉన్న కళావేదిక, శాంతినగర్‌లో పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ ఉషారాణి, శానిటరి ఇన్‌స్పెక్టర్ మూర్తి, సచివాలయం కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలపై కమిషనర్‌కు వినతి

పెదగంట్యాడ, సెప్టెంబరు 20: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం వినతపత్రం అందజేశారు. హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో గ్రీనరీకి వాటర్‌లైన్ ఏర్పాటు చేయాలని, స్వతంత్రనగర్ శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని, గంగవరం పోర్టు రోడ్డును ఆనుకుని ఉన్న పలుకాలనీలకు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు.

79 వార్డులోని సమస్యలపై...

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని కోతుతూ కమిషనర్ సంపత్‌కుమార్‌ను వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. గల్లవానిపాలెంలో చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. వార్డు పరిధిలో గల పలు పనులకు అనుమతుల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కొండవాలు ప్రాంతాలు అభివృద్ధి చేయాలి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వవార్డు పరిధిలోని కొండవాలు ప్రాంత ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు కమిషనర్ సంపత్ కుమార్‌ను కోరుతూ, వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న తాగునీరు. రోడ్లు, డ్రైనేజీల పనులు పూర్తి చేయాలని కోరారు.

మొక్కలు నాటారు

మల్కాపురం, సెప్టెంబరు 20 : రీజనల్ లేబర్ కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన విజీసీఎల్‌యూ యూనియన్ నాయకులు శుక్రవారం లేబర్ కమిషనర్ సిబ్బందితో కలిసి శుక్రవారం మొక్కలను నాటారు. యూనియన్ ప్రతినిధి డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు అవార్డు

పెందుర్తి, సెప్టెంబరు 20: పెందుర్తిలోని ఆదర్శ డిగ్రీ కళాశాలకు బెస్ట్ డిసిప్లెన్ అవార్డు లభించింది. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య వేడుకల్లో డిస్ట్రిక్ట్ మార్చ్ ఫాస్ట్ పరేడ్‌లో ఈ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ రవికుమార్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 20: నిర్వహణ పనుల వల్ల శనివారం ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతు బజారు, ఆకాష్ జూనియర్ కాలేజీ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరద బాధితులకు రూ.50 వేల విరాళం

మహారాణిపేట, సెప్టెంబరు 20: సీఎం సహాయనిధికి కంచరపాలెంలోని ఐలా సంస్థ చెర్మన్ జగపతి రాజు రూ.50 వేల చెక్కును కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు అందజేశారు. గతంలో రూ.50 వేల విరాళం ఇచ్చిన సంస్థ శుక్రవారం మరో రూ.50 వేల చెక్కును అందజేసింది.

హామీల అమలు దిశగా బాబు పాలన: ఎంపీ శ్రీభరత్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 20: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ తెలిపారు. గ్రేటర్ 45వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.లక్ష కోట్లకు పైగా బకాయి పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం కష్టాల్లో ఉందని, మెల్లమెల్లగా అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను త్వరలో ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను కొంతమందికి మాత్రమే ఇచ్చారన్నారు. అన్నక్యాంటీన్లకు రూ.5కే భోజనం అందిస్తున్న అక్షయపాత్ర సంస్థను అభినందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్ తదితరులు

ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఆపేసి అన్నం పెట్టే చేతినే నరికేసిందని మండిపడ్డారు. దుర్మార్గపు పాలన సాగించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసినందునే కూటమిని గెలిపించారని చెప్పారు. వైసీపీ నేతలు అరాచకాలు, గూండాయిజం చేస్తే గట్టిగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నజీర్, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్లు కంపా హనోక్, పెద్దిశెట్టి ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వార్డుల కూటమి అధ్యక్షులు భరణికాన రాజు, గార ఈశ్వరరావు, పుక్కళ్ళ పైడికొండ, కుట్టా కార్తీక్, కన్నం వెంకట రమణారావు, నమ్మి రవికుమార్, నాయకులు వాసుపల్లి రాజు, యాగాటి ఆదిలక్ష్మి, గొలగాని సౌజన్య జీవీఎంసీ జడ్సీ రాము పాల్గొన్నారు.

పాత నగరాన్ని గోల్డ్‌సిటీగా మారుస్తా: వంశీకృష్ణ

దొండపర్తి, సెప్టెంబరు 20: పాతనగరాన్ని 'గోల్డ్ సిటీ'గా మార్చడం, సీఎస్సార్ నిధులతో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, నెహ్రూ బజార్ ఆధునికీకరణ తన లక్ష్యమని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రేటర్ 27వ వార్డు నెహ్రూబజార్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులే అయినా ప్రజల గుండెల్లో నిలిచిపోయే ముఖ్యమైన హామీలు నెరవేర్చామన్నారు. ఉద్యోగుల బదిలీలు, పరిపాలన సౌలభ్యం కోసం అనేక కార్యక్రమాల రూపకల్పనలో ప్రభుత్వం నిమగ్నమై ఉందన్నారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, ఒకటో తేదీకి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, జాప్యం లేకుండా పింఛన్ల పంపిణీ వంటి హామీలు నెరవేర్చామని చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను గోడకు అతికించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వుడా కార్యదర్శి కీర్తి, దక్షిణ నియోజకవర్గం టీడీపీ, జనసేన ఇన్‌చార్జులు సీతంరాజు సుధాకర్, శివప్రసాద్‌రెడ్డి, వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, వార్డు టీడీపీ, జనసేన అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, చంటి, టీడీపీ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, మాజీ కార్పొరేటర్ రాజు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ హరేంధిర్ ప్రసాద్, నాయకులు, అధికారులు

సంక్షోభం నుంచి ప్రగతిపథంలోకి..

మహారాణిపేట, సెప్టెంబరు 20: సంక్షోభం నుంచి అభివృద్ధి పథంలోకి కూటమి ప్రభుత్వం దూసుకెళ్తోందని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మహారాణిపేట 29వ వార్డులోని దండుబజారు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించిన ప్రభుత్వ సిబ్బందిని సన్మానించారు. బీజేపీ నాయకులు రామ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అనురాధ పాల్గొన్నారు.

నౌపడ-గుణుపూర్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన

విశాఖపట్నం, సెప్టెంబరు 20: వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, గుణుపూర్ సెక్షన్‌లో తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం తనిఖీలు చేశారు. అమృత్ స్టేషన్ పథకం కింద నౌపడ స్టేషన్ వద్ద చేపట్టిన నిర్మాణ పనుల్లో భాగంగా 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన, ఇతర నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. అక్కడ నుంచి పర్లాకిమిడి స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, రైల్వే కార్యాలయాల నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే 12 మీటర్ల పాదచారుల వంతెన పనులను తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన రైల్వే వినియోగదారుల సంఘం ప్రతినిధుల వినతులను పరిశీలించి మరిన్ని ప్రయాణ సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గుణుపూర్, తిరువేలి మధ్య రైల్వే లైన్ ఏర్పాటు ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు. డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

'మన్యం ధీరుడు చిత్రాన్ని యువత వీక్షించాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: దేశభక్తిని రగిలించే మన్యంధీరుడు చలన చిత్రం వీక్షణ ఒక చారిత్రక అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మన్యం ధీరుడు చిత్రం విడుదల సందర్భంగా డాబాగార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర థియేటర్ వద్ద చిత్ర యూనిట్ సభ్యులు శుక్రవారం సందడి చేశారు. ఆర్‌వీవీ సత్యనారాయణ హీరోగా నటించిన చిత్రం ఆద్యంతం గొప్పగా ఉందని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. బ్రిటిష్ వారి గుండెల్లో సింహమై నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా నిర్మించిన మన్యం ధీరుడు చిత్రం ప్రతి ప్రేక్షకుడిలో దేశభక్తికాంక్షను రగిలిస్తుందన్నారు. చిత్ర దర్శకుడు నరేష్ డెక్కల మాట్లాడుతూ ఎందరికో స్ఫూర్తి కలిగించిన అల్లూరి చరిత్ర నేటి యువతకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులు, యూనిట్ సభ్యులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



చిత్ర విజయోత్సవంలో పాల్గొన్న నటీనటులు

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

▸▸ నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి



సీపీ శంఖబ్రత బాగ్చిని సన్మానిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు అనుగుణంగా ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగాలని నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి సూచించారు. గమ్యం చేరే సమయంలో, పోటీ పరీక్షల్లో ఒడిదొడుకులు సహజమని, ఒత్తిళ్లకు లోనవకుండా ముందుకు సాగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శ్రీ నవోదయ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి పోలీసు కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉద్యోగం రాలేదనే నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, షేక్ అన్వర్, కళాశాల కరస్పాండెంట్ డా.బీఆర్ఎస్ నారాయణ, బీశెట్టి మురళీప్రకాష్, డైరెక్టర్ విశ్వ కీర్తి, ప్రిన్సిపాల్ మైకేల్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

ఆరిలోవ, సెప్టెంబరు 20: నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి శుక్రవారం రాత్రి ఆరిలోవ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగానే ఆయన స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆరిలోవ, పీఎంపాలెం, త్రీ టౌన్ స్టేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని తెలిపారు. ఆరిలోవ మారుమూల ప్రాంతం కావడం, అటవీ ప్రాంతంలో ఉండడంతో ఎక్కువ నేరాలు జరుగుతున్నాయని చెప్పారు. సిబ్బంది అనవసరంగా సెలవులు తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పెదగదిలి జంక్షన్‌లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.


రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత..ముగ్గురి అరెస్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 20: రైల్లో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,13,500 విలువ చేసే 22.7 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఒక కేసులో కేరళలోని కొల్లాంకు చెందిన సచిన్ జేను, మరో కేసులో బీహార్‌లోని బక్సర్ జిల్లాకు చెందిన అమిత్ పాథక్, అయుష్‌కుమార్‌లను అరెస్టు చేశామని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే ఎస్ఐలు కాంతారావు, ఎస్.రామారావు తమ సిబ్బందితో గస్తీ తిరుగుతూ తనిఖీలు చేపడుతున్న సమయంలో నిందితులను పట్టుకున్నామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

కులగణన జరిగితేనే బీసీలకు న్యాయం

▸▸ బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

సీతంపేట, సెప్టెంబరు 20: జనాభా ప్రతిపాదికన బీసీల కులగణన జరగాలని, అంతకంటే ముందు ఎమ్మెల్యేల కులగణన చాలా అవసరమని రిటైర్డు పోలీసు ఉన్నతాధికారి, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 'బీసీల కులగణన, అత్యవసర అమలు, అవసరం, బీసీల రాజ్యాధికారం, హక్కుల సాధన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా కులాంధ్రప్రదేశ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రాధాన్యం చాలా తక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. దామాషా ప్రకారం మంత్రి పదవులు, ఇతర పోస్టుల్లో సింహభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ధైర్యం ఉందా? అన్ని సవాల్ విసిరారు. సమగ్ర కులగణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని, దీని కోసమే బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు. అధికారం లేకపోతే అణగారిన కులాలుగానే మిగిలిపోతారని, 50 శాతంపైగా ఉన్న బీసీల కోసం 2 శాతం నిధులు ఖర్చు చేసే దుర్మార్గం జరుగుతూనే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బహజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, బీఎస్పీ నాయకులు లాకే రాజారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

శరన్నవరాత్రి మహోత్సవాలకు రాట

సీతమ్మధార, సెప్టెంబరు 20: నక్కవానిపాలెంలోని ఏడు గుళ్ల అమ్మవారి ఆలయం వద్ద లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మహిళలు, యువతతో కలిసి రాటను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు రాజశ్రీనివాస్ రాజేష్, పవన్, చిన్న రామిరెడ్డి, రాజు, దుర్గా జగదీష్, నూకేష్, గణేష్, మురళి శంకర్ పాల్గొన్నారు.

నేడు దుర్గాగణపతి ఆలయంలో అన్నదానం

సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో శనివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

ముమ్మాటికీ కేంద్రం తప్పిదమే

ఉక్కుపై సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ధ్వజం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 20: కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలతోనే విశాఖ ఉక్కు కర్మాగారం నష్టాల్లోకి చేరుకుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి సీహెచ్ నర్సింగరావు దుయ్యబట్టారు. శుక్రవారం జగదాంబ వద్ద సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేట్‌కు దీటుగా ఎందుకు నిలువలేకపోతోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యానించడం ఆయన ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీయేని వెనకేసుకురావడం కోసం చంద్రబాబు విశ్వప్రయత్నం చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. కొవిడ్‌లోనూ విశాఖ ఉక్కు లాభాల్లోనే నడిచిందన్నారు. రాజకీయ కారణాలతో రాయబరేలిలో రైల్‌వీల్ ప్లాంట్ కోసం రూ.2 వేల కోట్లు అనవసరంగా ఖర్చు పెట్టడం, ఒడిశా మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఇనుప ఖనిజం కొనుగోలుకు ఒక్క టన్ను కూడా రాకపోయినా రూ.వెయ్యి కోట్లు వృధాగా ఖర్చుపెట్టడం, పన్నులు, డివిడెండ్ల పేరుతో రూ.58 వేల కోట్లు చెల్లించేలా చేసి కేంద్రం దీన్ని నష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు సీఎం ప్రత్యేక మిషన్ ఏర్పాటుచేయాలి

5వ పేజీ తరువాయి

ఉత్పత్తి పెంచడం, ముడిసరకు (రా మెటీరియల్) సరఫరా, సెయిల్‌లో విలీనం వంటి పనుల నిర్వహణ జరిగేలా ఈ మిషన్ చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఎంపీలు, ఉక్కు మంత్రిత్వ శాఖ, ప్లాంట్ ఉన్నతాధికారుల భాగస్వామ్యంతో ఈ మిషన్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్నం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాంటుకు సంబంధించి ఈ వంద రోజుల్లో రాష్ట్రంలోని కూటమి సర్కారు మాటలకు తగ్గట్టు చేతల్లో నిర్దిష్ట చర్యలేవీ తీసుకోలేదన్నారు. ప్లాంటుకు బొగ్గు సరఫరా చేయకుండా, బ్లాస్ట్ ఫర్నేస్ తెరిపించకుండా కార్మికులు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఆఫీసర్ల జీతాల్లో 30 శాతం కోతపెట్టడం, కాంట్రాక్టు కార్మికులకు 4 నెలలుగా జీతాలివ్వకపోవడం, ఉద్యోగులకు వేతన సవరణ చేయకపోవడం వంటి దుర్మార్గపు చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. కేంద్ర చర్యలపై వామపక్ష పార్టీలను, కార్మిక, ప్రజా సంఘాలను కలుపుకొని సీపీఎం పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి మృతికి సంతాప సూచికంగా మౌనం పాటిస్తున్న నాయకులు

ఏచూరి ఆశయసాధనకు సీపీఎం కృషి

▸▸ సంతాపసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం తమ పార్టీకే కాక దేశానికి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరై ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్ష, లౌకిక శక్తులను కూడగట్టడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన పోరాట పటిమ, పార్టీలో అంచెలంచెలుగా అగ్రస్థానానికి ఎదిగిన క్రమాన్ని వివరించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి సీపీఎం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ, సీపీఐ, ఆర్‌పీఐ నాయకులు సీహెచ్ నరసింగరావు, ఎం.పైడిరాజు, ఎస్.సుధాకర్, సీర సతీష్, దేవ, గణేష్‌పాండ, కల్యాణరావు ఎ.అశోక్ పాల్గొన్నారు.

బదిలీలకు జోరుగా పైరవీలు

... 5వ పేజీ తరువాయి

చేయించుకునేవారు. ఇప్పుడు అలా కాకుండా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ద్వారా మూడు పార్టీల ప్రజా ప్రతినిధుల నుంచి లేఖలు తీసుకుంటున్నారు. ఇలా కుప్పలు తెప్పలుగా వస్తున్న సిఫారసు లేఖలను తీసుకుంటున్న ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి వెంటనే సంబంధిత ప్రజా ప్రతినిధులకు ఫోన్ చేసి ఎవరిని పరిగణనలోకి తీసుకోవాలని అడుగుతున్నట్టు తెలిసింది. బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉంది. ఇదిలావుండగా సిఫారసు లేఖలు ఇచ్చేందుకు కొందరు నేతలు తమ అనుచరులు, మధ్యవర్తుల ద్వారా సొమ్ములు తీసుకుంటున్నారనే ప్రచారం సాగుతుంది.

యూఎల్‌సీ కింగ్ పైరవీలు

గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన యూఎల్‌సీ కింగ్ కూటమి ప్రభుత్వంలో తనకు తెలిసిన ఇద్దరు ప్రజా ప్రతినిధుల ద్వారా రెవెన్యూ బదిలీల్లో పైరవీలు చేస్తున్నారని ప్రచారం సాగుతుంది. మహిళా తహసీల్దారు ఒకరికి ప్రాధాన్యం కలిగిన మండలంలో పోస్టింగ్ వేయించాలని కోరేందుకు ఒక ప్రజా ప్రతినిధి సూచన మేరకు ఉమ్మడి జిల్లాలో కీలక నేతను కలిశారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే యూఎల్‌సీ కింగ్‌పై కీలక నేత ఒంటికాలుపై లేచారని తెలిసింది. గత ప్రభుత్వంలో అనేక వివాదాస్పద భూముల వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నావని, చివరకు దసపల్లా భూముల్లో వైసీపీ నేతకు భారీగా లబ్ధి చేకూర్చడంలో కీలకపాత్ర పోషించావని మండిపడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చినా నీ పెత్తనం ఏమిటని చీవాట్లు పెట్టారని తెలిసింది.

వీఎంఆర్‌డీ సెక్రటరీ పోస్టుకు పైరవీ

విశాఖ జిల్లాలో రెండు చోట్ల తహసీల్దార్‌గా పనిచేసిన తరువాత పదోన్నతిపై బయటకు వెళ్లిన అధికారి ఒకరు వీఎంఆర్‌డీ సెక్రటరీగా రావాలని గట్టిగా యత్నించారు. నగరంలో కూటమికి చెందిన ప్రజా ప్రతినిధి ద్వారా సిఫారసు చేయించుకుని లేఖను మునిసిపల్ మంత్రికి అందజేశారు. అయితే సదరు అధికారి తహసీల్దారుగా ఉండగా ప్రభుత్వ చెరువులను జిరాయితీగా మార్చేసిన ఘనత ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఒక ఎమ్మెల్యే అప్రమత్తమై వెంటనే మంత్రి నారాయణకు సమాచారం అందించడంతో సదరు అధికారి పేరును తప్పించారు. ఇంకా నగరంలో తహసీల్దారుగా పనిచేసి పదోన్నతి పొందిన ఒకరు, సింహాచలం దేవస్థానం ఈవోగా పనిచేసిన మరొకరు వ్యక్తి వీఎంఆర్‌డీఏ సెక్రటరీ పోస్టుకు ప్రయత్నిస్తున్నారు.

ఉత్సాహంగా 'ఇది మంచి ప్రభుత్వం'

... 5వ పేజీ తరువాయి

రామకృష్ణబాబు పాల్గొన్నారు. భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతోపాటు కూటమి నేతలు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని నెహ్రూ బజార్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో చేసిన మంచిని, చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే 'ఇది మంచి ప్రభుత్వం' ఉద్దేశమన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని 45వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పశ్చిమ నియోజకవర్గంలోని ఏకేసీ కాలనీలో ఎమ్మెల్యే గణబాబు, పెందుర్తి నియోజకవర్గం ముదపాకలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

భీమిలి ఆర్డీవో బరితెగింపు!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచింది. ఆ భూమిపై కన్నేసిన ఒక వ్యక్తి సర్వే నంబర్ 133లో 3.47 ఎకరాలు తనదంటూ ఏడాది క్రితం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. భూమి కొట్టేయడానికి వీలుగా తప్పుడు పత్రాలు సృష్టించారు. ఐటీ సంస్థలు, భారీ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు ఉన్న ఆ ప్రాంతంలో ఎకరా రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు పలుకుతుంది. తప్పుడు పత్రాలతో భూమి కాజేసే యత్నం వెనుక నాటి వైసీపీలో కీలక వ్యక్తులు ఉండడంతో అధికారులు ఫైలు ఆగమేఘాలపై ముందుకు కదిపారు. సర్వే నంబరు 133లో 9.36 ఎకరాలను హౌసింగ్ బోర్డుకు అప్పగించిన విషయాన్ని ప్రస్తావించకుండా భీమిలి ఆర్డీవో ద్వారా జేసీకి పంపారు. ఈ ఫైలు అందే సమయంలో జేసీగా విశ్వనాథన్ ఉన్నారు. అదే సమయంలో మధురవాడలో తమకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని హౌసింగ్ బోర్డు అధికారులు జేసీకి చెప్పడంతో పాటు భూమి వివరాలు అందజేశారు. దీంతో ఆయన అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అప్పటికే తన వద్ద ఉన్న ఫైలులో ఉన్న సర్వే నంబరు, బోర్డు అధికారులు ఇచ్చిన సర్వే నంబరు ఒక్కటే కావడంతో ఆయనకు అనుమానం వచ్చింది. సాధారణంగా తన వద్దకు భూముల ఫైలు వస్తే వెంటనే సదరు భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం విశ్వనాథన్‌కు అలవాటు. ఆయన స్వయంగా మధురవాడలో సర్వే నంబరు 133లో గల భూమిని పరిశీలించి హౌసింగ్ బోర్డుకు కేటాయించినదిగా గుర్తించారు. అయినా ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిగా పేర్కొంటూ ఫైలు పంపడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించి ఆర్డీవో, అప్పటి విశాఖ రూరల్ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. తరువాత కొద్ది నెలలకు జేసీని ప్రభుత్వం బదిలీ చేయడం, ఈలోగా ఎన్నికలు రావడంతో భూమి వ్యవహారం తెర మరుగైంది. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్వే నంబరు 133లో గల భూ వ్యవహారంపై దృష్టిసారించింది. అక్రమాలు జరిగినట్టు గుర్తించి ఆర్డీవో భాస్కర్‌రెడ్డితో పాటు ఆర్ఐ మల్లేశ్వరరావు, గ్రేడ్-2 వీఆర్వో దుర్గాప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. తహసీల్దారు రమణయ్య అప్పటికే హత్యకు గురికావడంతో ఆయన పేరు ప్రస్తావించలేదు. తహసీల్దారుగా ఉన్నప్పుడు సర్వే నంబరు 133లో భూమిని హౌసింగ్ బోర్డుకు అప్పగించిన భాస్కరరెడ్డి, అదే ఆర్డీవో అయిన తరువాత అదే భూమిలో 3.47 ఎకరాలు ప్రైవేటు వ్యక్తికి అప్పగించేలా ఫైలు పంపడం పరిశీలిస్తే అక్రమాలకు ఏ విధంగా సహకరించారో అర్థమవుతుందని రెవెన్యూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా ఓట్ల లెక్కింపు అనంతరం సెలవుపై విదేశాలకు వెళ్లిన భాస్కర్‌రెడ్డి ఇటీవల తిరిగి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే హౌసింగ్ బోర్డు భూమి వివాదంలో ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైలు సిద్ధమైంది. అయినా ఆయన ఆర్డీవోగా తిరిగి బాధ్యతలు స్వీకరించేందుకు ప్రభుత్వం అనుమతించడం ఆశ్చర్యకరం.

'భూదాన్ ఆక్రమణలు నివారించాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 20: భూదాన్ భూముల సంరక్షణకు నడుం కట్టిన సర్వోదయ మండల్ భూముల పరిరక్షణకు కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ చైర్మన్ ఎస్.రాంబాబు నాయుడు తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాలోని భూదాన్ భూములను సంరక్షించి, వాటిని సేకరించిన ఆచార్య వినోబా భావే సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. తెలంగాణ భూదాన్ బోర్డు చైర్మన్ ఆర్.శంకర్ నాయక్ మాట్లాడుతూ భూదాన్ భూముల రక్షణ తమ ధ్యేయమన్నారు. ప్రధాన కార్యదర్శి డి.దీనబంధు మాట్లాడుతూ పదేళ్ల తరువాత మండల్ తిరిగి ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు వల్లూరి లత, రవికుమార్, జి.ప్రదీప్ పాల్గొన్నారు.


కల్యాణం చేస్తున్న అర్చకులు

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, సెప్టెంబరు 20 : వరాహలక్ష్మీనృసింహ స్వామి అర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఏఐటీయూసీ సమావేశం

తగరపువలస, సెప్టెంబరు 20 : చిట్టివలస జూట్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు సీపీఐ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ కొంతకాలంగా చేస్తున్న పోరాటాల వల్ల కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, కానీ ఆర్థికపరమైన సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు జీరు వెంకటరెడ్డి, టీఎన్‌టీయూసీ నాయకులు సాడి అచ్చారావు, కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకుడు దల్లి అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాటితూరులో 'పొలంబడి'

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 20 : మండలంలోని తాటితూరు గ్రామంలో వ్యవసాయాధికారులు శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకుడు కె. విజయప్రసాద్ కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగుల నివారణ గురించి రైతులకు వివరించారు. అలాగే పురుగు మందుల వాడకం తగ్గించే విధానాలను ఏఓ శివకోమలి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వాతి, స్రవంతి, రమేష్, హరీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం



తగరపువలస, సెప్టెంబరు 20 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన చిట్టివలస బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రోజామణి, సోషల్ ఉపాధ్యాయిని లక్ష్మిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పురస్కార గ్రహీతల సేవలను కొనియాడారు.

పద్మనాభంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

పద్మనాభం, సెప్టెంబరు 20 : పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయ ఆవరణలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి బీకే మంజునాథ వ్రతం ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం వ్రతంలో పాల్గొన్న దంపతులకు లక్ష్మీ, నారాయణుల చిత్రపటం బహూకరించి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, మాజీ ఎంపీపీ కాళ్ల పద్మనాయకులు పైడిరాజు, నారాయణరావు, బ్రహ్మకుమారీలు సత్యఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ, 24, క్యారెట్ 37, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది) 105, బరబటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ I లో..


కార్యక్రమంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు


తోటగరువులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

'ఇది మంచి ప్రభుత్వం' ఆశీర్వదించండి

▸▸ ఎంపీ శ్రీభరత్, భీమిలి, తూర్పు ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడి

భీమునిపట్నం, సెప్టెంబరు 20 : పట్టణంలోని మేదరవీధిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారిలక్ష్మి, కూటమి నాయకులు రాజబాబు, సందీప్, రామానాయుడు, గండిబోయిన పోలిరాజు, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, కంటుభుక్త సునీత, అప్పికొండ నూకరాజు, బొద్దు రమేష్, కొప్పుల కృష్ణారావు, వెంకటరావు, జడ్పీ ప్రేమ ప్రసన్న వాణి, ఎంపీడీవో జానకి పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో 16,437 పోస్టుల భర్తీతో పాటు ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల్లో మనోధైర్యాన్ని నింపిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అక్కరబోయిన రాంబాబు, బుడమూరి గోవింద్, వేజెళ్ల సుబ్బరాజు, గరికిన నూకరాజు, చిన్నారావు, ఉమ్మడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి, మద్ది, అయినాడ, కృష్ణాపురంలో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు నగేష్‌కుమార్, అప్పలనాయుడు, మహంతి అప్పలరమణ, వెంకటరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే ప్రజల్లో సంతృప్తి

ఆరిలోవ : కూటమి ప్రభుత్వ పాలనపై వంద రోజుల్లోనే ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతుందని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో 12వ వార్డులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని చెప్పారు. అనంతరం తోటగరువు, గణబాబు నగర్, బీటీఆర్‌నగర్, సూర్యతేజ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఒమ్మి అప్పలరాజు, జి. సత్యం, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు. పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలోనూ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, మద్దిల రాజేష్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. 11, 13వ వార్డుల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

కొమ్మాది : కూటమి పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాయకులు పీఎంపాలెం, గాయత్రినగర్, కొమ్మాదిలో ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్, గొలగాని సన్యాసిరావు, లొడగల జానకీరామ్, రెడ్డి సత్యనారాయణ, జనసేన వార్డు అధ్యక్షుడు సంతోష్ నాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : తాళ్లవలస, కృష్ణంరాజుపేటలో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సింగనబంద సర్పంచ్ నారాయణ ఇంటింటికి వెళ్లి ప్రజలకు వంద రోజుల పాలనపై వివరించారు.

ఆనందపురం : అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీవో లవరాజు, నాయకులు కోరాడ రాజబాబు, ఘట్టమనేని బోస్‌బాబు, గంట్రెడ్డి స్వామినాయుడు, బమ్మిడి ఉమ పాల్గొన్నారు.

మద్దిలపాలెం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి పునాదులు వేశారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ అన్నారు. 22వ వార్డులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి వెంకటస్వామి, ఒమ్మి అప్పారావు, డొక్కర శ్రీను, దువ్వి రాజ్‌కుమార్, కోడిబోయిన ఆనంద్, బర్ల రాజు, పడాల డేవిడ్, గణేష్, సన్నీ, జయమ్మ పాల్గొన్నారు.

పెదవాల్తేరు : పెదవాల్తేరులో 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముందుగా నాయకులు గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

మహారాణిపేట : రామ్‌నగర్‌లోనూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అధికార ప్రతినిధి, వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి పైడిరాజు, నాగుల సన్యాసిరావు, డొంకర శంకర్, ఉసిరికాయల ఢిల్లీశ్వరి, కనక మహాలక్ష్మి, శ్యామల, లక్ష్మి, అమ్ములు, నక్కేల త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : పాత వెంకోజీపాలెంలో కూటమి నాయకులు వంద రోజుల్లో ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, కర్రి గౌరీ, వరలక్ష్మి, పెంటకోట ప్రకాశ్, మళ్ల పోలిరాజు, జనసేన నాయకుడు పచ్చితాల సాయిబాబా, బీజేపీ నాయకుడు కనకాల పాపారావు పాల్గొన్నారు. ఏయూ మెయిన్ గేటు వద్ద ఏయూ తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో పీతల అమరేంద్ర, బండారి దేముడు, ఒమ్మి నూకరాజు, పీతల వెంకట్రావు, చిరంజీవి, గణేశ్ పాల్గొన్నారు.

చెరువు కాదు..పద్మనాభం-రెడ్డిపల్లి రోడ్డు


రెడ్డిపల్లి వద్ద చెరువులా దర్శనమిస్తున్న ప్రధాన రహదారి

పద్మనాభం, సెప్టెంబరు 20 : పద్మనాభం-రెడ్డిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఉండడంతో వర్షం పడితే వాటిల్లో నీరు చేరి చెరువులా కనిపిస్తున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ పరిస్థితి నెలకొంది. రాత్రి వేళ గోతుల్లో పడి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రోడ్డు దుస్థితిని చూసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.వర్షాలు లేని సమయంలో కూడా నీరు అలాగే ఉండి చెరువులా దర్శనమిస్తోంది. సైడు కాలువలు మూసుకుపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. రోడ్డు విస్తరణ పనులు చేయకపోయినా పర్వాలేదు కానీ గోతులను పూడ్చండి మహాప్రభో అని వాహనదారులు వేడుకుంటున్నారు.

భీమిలి, వాంబే కాలనీల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభం


భీమిలి : అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, సెప్టెంబరు 20 : అన్న క్యాంటీన్లు విజయవంతంగా నిర్వహించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. చిన్నబజారులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోజన పదార్థాల తయారీలో నాణ్యతకు ప్రాధాన్యమిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి అందరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, కూటమి నాయకులు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, కంటుభుక్త రామానాయుడు, గాడు అప్పలనాయుడు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర కుమార్, గాడు వెంకటప్పడు, కొప్పుల రమేష్, యరబాల అనిల్ ప్రసాద్, భీమిలి జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, ఎంపీడీవో జానకి, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : నిరుపేదలకు మూడు పూటలా కడుపు నిండా అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మళ్లీ పునః ప్రారంభం కావడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గంటా అన్నారు. శుక్రవారం ఆయన 7వ వార్డు వాంబేకాలనీలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కానూరి అచ్చుతరావు, నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన నాయుడు, పీవీఎస్ఎన్ బాలాజీ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 62 మందికి ఉద్యోగాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 20 : పట్టణంలోని నేరేళ్లవలస కాలనీలో ఉన్న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, భీమిలి పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా జరిగింది. 244 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్మెంట్ ఆఫీసర్ రమేష్‌నాయుడు, టాటా ట్రెంట్ లిమిటెడ్ ప్రతినిధి మణికంఠ, బిడేటా టెక్నాలజీస్ ప్రతినిధి హిమజ,అపోలో ప్రతినిధి నాగశంకర్, ఫ్లూయెంట్ గ్రిడ్ ప్రతినిధి రామకృష్ణ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ అన్నపూర్ణ, పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెలగపూడిని సత్కరిస్తున్న భానునగర్ కాలనీవాసులు

కల్యాణ మండపం నిర్మాణానికి కృషి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 20 : జీవీఎంసీ 16వ వార్డు భానునగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో కల్యాణ మండపం నిర్మిస్తామని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హామీ ఇచ్చారు. శుక్రవారం కాలనీవాసులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి స్థలం వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ కాలనీవాసుల అభ్యర్థన మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు స్థలంలో కల్యాణ మండపం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తొలుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వంకా లాజరస్, శివశంకర్, జి. వామనమూర్తి, ఒమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై సదస్సు


మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

ఆరిలోవ, సెప్టెంబరు 20 : బాలల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. శుక్రవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ, విద్యాహక్కు చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. కొంతమంది బాలికలు తమ సమస్యలను నేరుగా చెప్పలేరని ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తే వాటిలో తమ ఇబ్బందులను తెలియజేస్తారన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం తదితర వాటిపై వివరించారు.ఈ సదస్సులో డిప్యూటీ డీఈఓ రవీంద్రబాబు, జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలెప్‌మెంట్ అధికారిణి కాలేషా బేగం, స్కూల్ కమిటీ ఛైర్మన్ జాన్ ప్రసాద్, సైకాలజిస్ట్ పార్వతీ కశ్యప్, హెచ్ఎం రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం విమానాశ్రయానికి 'అల్లూరి' పేరు పట్ల హర్షం

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 20 : భోగాపురం విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడానికి రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో తీర్మానించడం పట్ల మాజీ మంత్రి అప్పలనరసింహరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 జూలై 4న విజయవాడలో జరిగిన అల్లూరి జయంతి వేడుకల్లో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును తాము కలిసి భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టాలని కోరామని గుర్తు చేశారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆనందపురం, సెప్టెంబరు 20 : మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గంటాకు తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకుని ఉన్న జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించడంతో పాటు ఇంటర్ విద్యార్థులకు తరగతి గదులు నిర్మించాలని కోరారు. వేములవలస పూలమార్కెట్ వద్ద అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆనందపురం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేయాలని, ఎన్‌హెచ్ 16 నీళ్లకుండీలు జంక్షన్ వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంతి శివాజీ, అంగటి రాము, పాండ్రంకి అప్పలరాజు, లొడగల రమణ పాల్గొన్నారు.

హిమాలయ ఆప్టికల్స్ షోరూమ్ ప్రారంభం



మాట్లాడుతున్న సినీ నటి అనన్య నాగళ్ల

ఎన్ఏడీ జంక్షన్, సెప్టెంబరు 20 : బుచ్చిరాజుపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిమాలయ ఆప్టికల్ స్టోర్స్‌ను సినీ నటి అనన్య నాగళ్ల శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టోర్స్‌లో అత్యాధునిక సాంకేతికతో కూడిన కళ్లద్దాలను సామాన్యులకు అందుబాటు ధరలో లభ్యమయ్యేలా నిర్వాహకులు ఉంచారన్నారు. షోరూమ్‌ను ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. హిమాలయ రీజినల్ హెడ్ మయాంక్ బంగూర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతతో కూడిన కళ్లద్దాలను పరిచయం చేయటంలో తమ స్టోర్స్ ముందు ఉంటుందన్నారు.

జడ్సీని కలిసిన జనసేన నాయకులు

కొమ్మాది, సెప్టెంబరు 20 : జోన్ 2 జడ్సీ పొందూరు సింహాచలంను ఏడో వార్డు జనసేన నాయకులు జోనల్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులోని సమస్యలను జడ్సీ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడో వార్డు జనసేన అధ్యక్షుడు నాగోతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సన్యాసిరావు మృతి పట్ల నివాళి

తగరపువలస, సెప్టెంబరు 20 : తగరపువలసకు చెందిన ప్రజా నాట్యమండలి సీనియర్ కళాకారుడు గండిరెడ్డి సన్యాసిరావు మృతి కళా రంగానికి తీరని లోటని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తగరపువలస మున్సిపల్ పార్కులో సన్యాసిరావు మృతి పట్ల సంతాప సభ నిర్వహించారు. సమావేశంలో సూర్యనారాయణ, ఈశ్వరరావు, సీఐటీయూ నాయకుడు అప్పనాయుడు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట

మధురవాడ, సెప్టెంబరు 20 : జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ కాలనీలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉడుపురాట వేశారు. ఈ ఆలయంలో 40 ఏళ్లుగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 20 : ఏయూ సంగీత నృత్య విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్య శోభ అన్న అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు పోస్టర్‌ను వీసీ ఆచార్య జి. శశిభూషణరావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్. కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్ నరసింహారావు, సంగీత విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ అనురాధ, సదస్సు సహాయ కన్వీనర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు. సంగీత విభాగం 35వ, నృత్య విభాగం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సదస్సును ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరం వేదికగా నిర్వహిస్తున్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ మొల్లి హేమలత

జీవీఎంసీ కమిషనర్‌కు 5వ వార్డు కార్పొరేటర్ వినతి

కొమ్మాది, సెప్టెంబరు 20 : తమ వార్డులోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వార్డులోని సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో దాదాపు 70వాట్స్ లైట్లు 80, 40 వాట్స్ లైట్లు 30, 20 వాట్స్ లైట్లు అమర్చాల్సి ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సత్వరమే నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పివి నరసింహం కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఏయూలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 20 : ఏయూలో పర్యావరణ శాస్త్ర విభాగం, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా శుక్రవారం ఓజోన్ డే నిర్వహించాయి. ఏయూ పూర్వ విద్యార్థుల కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఏయూ రిజిస్ట్రార్‌ను కలిసిన జనసేన నాయకులు


రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావును జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. శివశంకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారం వంటి అంశాలపై చర్చించారు. అలాగే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, ఏయూ పూర్వ విద్యార్థి రాజబాబు కూడా రిజిస్ట్రార్‌ను కలిశారు.